# ‘ప్రత్యక్ష విక్రయాల వ్యాపార రంగాన్ని ఆదుకోవాలి’

సాక్షి, న్యూఢిల్లీ: ప్రత్యక్ష విక్రయాల వ్యాపార రంగాన్ని ఆదుకోవాలని డైరెక్ట్ సెల్లింగ్ డిస్ట్రిబ్యూటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రత్యక్ష విక్రయ వ్యాపార రంగానికి ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరుతూ మంగళవారం నగరంలోని జంతర్ మంతర్ వద్ద ఈ సంఘం ధర్నా నిర్వహించింది. అనంతరం ప్రధాని మన్మోహన్ సింగ్, ఇతర మంత్రిత్వశాఖలకు వినతి పత్రాలను సమర్పించింది. తొలుత ధర్నానుద్దేశించి పలువురు వక్తలు మాట్లాడుతూ దేశంలో ప్రత్యక్ష విక్రయాలపై ఆంక్షలు విధిస్తే దీనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న దాదాపు 10 కోట్ల మంది ఉపాధి కోల్పోతారన్నారు. ప్రత్యక్ష విక్రయాల్లో ఎక్కడా మోసం లేదని, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందుతాయని, ప్రభుత్వానికి కూడా అమ్మకపు పన్నుద్వారా ఆదాయం లభిస్తుందన్నారు. మనీ సర్క్యులేషన్ వ్యాపారంతో డైరెక్ట్ సెల్లింగ్ వ్యాపారాన్ని పోల్చకూడదని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెండు వ్యాపారాల్లో అనేక తేడాలు ఉన్నాయని, మనీ సర్క్యులేషన్‌ను నియంత్రించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

దేశంలో 1990 నుంచి ప్రత్యక్ష విక్రయాలు జరుగుతున్నా సర్కార్ ఇప్పటివరకు ఎలాంటి నియంత్రణ సంస్థనుగాని, అథారిటీగాని, చట్టాన్నిగాని తెచ్చే అంశంపైకి దృష్టిని సారించలేదన్నారు. చట్టాలు లేకపోవడం వల్ల ప్రత్యక్ష విక్రయాల వ్యాపారాలను ఇష్టారాజ్యంగా మలచుకుని చాలా మంది మనీ సర్క్యులేషన్ ద్వారా వసూళ్లకు పాల్పడ్డారని చెప్పారు. ఇలాంటి చర్యలు ప్రత్యక్ష విక్రయాలకు మచ్చను తెచ్చిపెడుతున్నాయన్నారు. ప్రత్యక్ష విక్రయాలు సజావుగా సాగడానికి ప్రభుత్వం ఒక చట్టం తేవాలన్నారు.

కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ డైరెక్ట్ సెల్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.పి.రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిశోర్ వర్మ, డైరెక్ట్ సెల్లింగ్ డిస్ట్రిబ్యూటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేంద్ర వత్స్, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.



**జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న డైరెక్ట్ సెల్లింగ్ డిస్ట్రిబ్యూటర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు**